

నేడు ఎస్ఎఫ్ఐ చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 16వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవిత్ర, డి.చందు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. డిగ్రీ అడ్మిషన్లు తక్షణం ప్రారంభించాలని, డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు తల్లికి వందనం పథకం అందజేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ భారం తగ్గించాలని, హాస్టల్ మెస్‌ఛార్జీలు ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచాలని, బకాయిలు అందజేయాలని, కళాశాలలు, విశ్వవిద్యాలయంలో ఖాళీ లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలే రాజ్యాంగ రక్షకులు

- నిర్వీర్యం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలి
- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బిజెపి, ఆర్ఎస్ఎస్‌తో ఎదురవుతున్న సవాళ్ల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజల పైనే ఉందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. నగరంలోని స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన 'భారత రాజ్యాంగానికి ఎదురవుతున్న తాజా సవాళ్లు, ప్రజాస్వామ్య మనుగడపై ప్రభావం' అంశంపై మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో ముఖ్య వక్తగా మాట్లాడారు. భారత రాజ్యాంగ పీఠిక నుంచి సెక్యులరిజం, సోషలిజం పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ డిమాండ్ చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాజాంగ్యం ఆవిర్భావం నుంచి దాడి జరుగుతూనే ఉందని, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అది మరింత తీవ్రతరమైందన్నారు. రాజ్యాంగంలో పౌరులకు కల్పించిన అనేక హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. రాజ్యాంగంలో ప్రజలకు మత స్వేచ్ఛ కల్పించినా, మోడీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. పర్యావరణాన్ని, ప్రకృతి వనరులను రక్షించాలని పౌరుల విధుల్లో పేర్కొన్నా, మోడీ ప్రభుత్వమే ప్రకృతి వనరులను, సహజ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందన్నారు.

ఫెడరలిజం స్ఫూర్తికి విరుద్ధంగా బిజెపి ప్రభుత్వ పాలన

రాజ్యాంగం సమానత్వ హక్కు కల్పించినా స్త్రీలు, దళితుల మధ్య వివక్ష చూపేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ ఫెడరలిజం స్ఫూర్తిగా విరుద్ధంగా బిజెపి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ఉమ్మడి జాబితాలోని విద్య, విద్యుత్ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. సిబిఐ, ఇడి, ఆదాయపన్ను శాఖ వంటి స్వతంత్ర సంస్థలను ప్రతిపక్ష పార్టీలపై దాడులకు వినియోగిస్తూ వాటిని దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమిషన్ వంటి స్వతంత్ర వ్యవస్థల్లో జోక్యం చేసుకుంటూ బిజెపి ప్రభుత్వం తన గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తోందన్నారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో రూపొందిన భారత రాజ్యాంగం అనేక సవాళ్లను ఎదుర్కొని భారతదేశాన్ని లౌకిక ప్రజాస్వామ్య దేశంగా నిలిపిందన్నారు. ప్రజలు మరింత చైతన్యవంతంగా మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

అంతకుముందు స్వాతంత్ర సమరయోధుడు, కవి గరిమెళ్ల సత్యనారాయణ, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు వి.జి.కె మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. భారత స్వాతంత్రోద్యమానికి గరిమెళ్ల అందించిన సేవలను, ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేశారు. గరిమెళ్ల పేరుతో విజ్ఞాన కేంద్రాన్ని స్థాపించి తద్వారా సమకాలీన అంశాలపై ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలతో నిరంతరం ప్రజల మనిషిగా వి.జి.కె మూర్తి నిలిచారని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా గాయకులు చింతాడ రామచంద్రరావు పలు అభ్యుదయ గేయాలను ఆలపించారు. విశ్రాంత డైట్ కాలేజ్ ప్రిన్సిపాల్ కొత్తకోట అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో శ్రీకాకుళం నగరం ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి జామి భీమశంకరరావు, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, సహాయ కార్యదర్శి పి.సుధాకరరావు ఆహ్వానం పలకగా, కె.ఎస్ రామకృష్ణ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో జి.సతీష్ కుమార్, కె.ఎస్.ఎన్ మూర్తి, పి.వి రమణమూర్తి, జె.ఎస్.ఎస్ ప్రకాశరావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు గొంటి గిరిధర్, వి.జి.కె మూర్తి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకరరావు

ప్రజాశక్తి - మందస, శ్రీకాకుళం సిటీ, ఎచ్చెర్ల

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకరరావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మందస తహశీల్దార్ కార్యాలయంలో గిరిజనులతో మంగళవారం నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు, మన్యం ప్రాంతాల్లో ఇప్పటికే పర్యటించిన తాను, ఈ ప్రాంత సమస్యలపైనా అవగాహన ఉందని తెలిపారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం, అధికారులతో కలిసి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి గిరిజనులు అవగాహన పెంచుకోవాలని, సమిష్టి కృషితో గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వాట్సాప్ ద్వారా సమస్యలు తెలియజేస్తే, వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు. ముఖ్యంగా భూ సమస్యలు పరిష్కరించి భూ హక్కు కల్పించాలని, తాగునీరు, రహదారి సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. చీపి పంచాయతీకి అనుసంధానంగా ఉన్న వంతెనను నిర్మించాలని, తద్వారా రాకపోకల ఇబ్బందులు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు అన్నా దొర, ఆర్‌డిఒ జి.వెంకటేష్, సహాయ గిరిజన సంక్షేమ అధికారి మల్లికార్జునరావు, తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఒ సత్యనారాయణ, జిల్లా గిరిజన ఐక్యవేదిక సంఘం అధ్యక్షులు చౌదరి లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల రమణమూర్తి, సవర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆంగ్ల పదాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. భోజనాలు, మౌలిక వసతులపై ఆరా తీశారు. అందరూ బాగా చదువుకోవాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వెయ్యి మంది విద్యార్థులు ఉండే ఎస్‌సి, ఎస్‌టి పోస్టుమెట్రిక్ హాస్టల్స్ రెండు, ప్రీ మెట్రిక్ రెండు హాస్టల్స్, బిసి హాస్టల్స్‌కు విద్యార్థులు వెళ్లేందుకు 150 మీటర్ల రహదారి, కాలువలు నిర్మించాలని ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు శంకరరావును కోరారు. వర్షాకాలంలో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అంతకుముందు ఎస్‌టి కమిషన్ చైర్మన్ అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

విద్యాలయాలు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ కల్పించిన రిజర్వేషన్ అవకాశాలను గిరిజనులకు అందేలా చూడాల్సి ఉందని శంకరరావు అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు, సిబ్బందితో విశ్వవిద్యాలయంలో రిజర్వేషన్ అమలుపై సమీక్షించారు. రోస్టర్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌టి అధ్యాపకులు గతంలో తమ జీతాల విషయంలో ఎదుర్కొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తమకు ప్రత్యేక హాస్టల్ అవసరమని, ఉపకార వేతనాలు కూడా రావడం లేదని గిరిజన విద్యార్థులు తెలిపారు. గ్రంథాలయంలో కాంపిటేటివ్ బుక్స్ కావాలని కోరారు. తొలుత యూనివర్శిటీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని, రెక్టార్ ఎస్.అడ్డయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకాకుళం సిటీ : విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

ఖతర్‌లో వెల్డింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఖతర్ దేశంలోని వెల్డింగ్ రంగంలో ఉద్యోగాల కోసం ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టిఐజి, ఎఆర్‌సి మల్టీవెల్డర్, వెల్డర్ ఉద్యోగాలకు వయసు 24 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలని స్పష్టం చేశారు. ఐటిఐ, ఐటిసి అర్హతతో పాటు కనీసం నాలుగేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. మల్టీవెల్డర్ పోస్టులకు నెల జీతం రూ.52 వేల నుంచి రూ.61,500 వరకు, వెల్డర్ పోస్టులకు రూ.42,500 నుంచి రూ.52 వేల వరకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టు కాలం రెండేళ్లు. ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయాలతో పాటు ఒకసారి స్వదేశానికి టికెట్ సౌకర్యం కల్పిస్తారని తెలిపారు.

దరఖాస్తుదారులు తమ పాస్‌పోర్టు, విద్యా, అనుభవ పత్రాలతో జులై 31వ తేదీ లోగా https://naipunyam.ap.gov.in/user-registration?pageRprogram-registrationలో దరఖాస్తు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9550215161, 9160912690, 9988853335 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పి-4

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పి-4 విధానాన్ని గ్రామ, వార్డు స్థాయిల్లో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల్లో భాగంగా ఈ నెలాఖరుకు బంగారు కుటుంబాల తుది జాబితాను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలోని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మేలు కలిగించే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా 12 ప్రధాన అంశాలపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. బంగారు కుటుంబం, వైద్యం, ఆరోగ్యం, రైతులకు అందుబాటులో ఎరువులు, రుణాల మంజూరు, వసతిగృహాల్లో అదనపు సౌకర్యాలు, కోర్టు కేసులు తదితర అంశాలపై సమీక్షించారు. బ్యాంకు అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, రైతుల అవసరాలకు తగిన పంట రుణాలు అందించే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, వైద్యారోగ్యశాఖ, మున్సిపాలిటీ అధికారులు నీటి నమూనాలను పరీక్షించి ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, ఆస్పత్రులు, బస్టాండ్లలో పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ తప్పనిసరి అని తెలిపారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చే ప్రజా సమస్యలపై అధికారులు మరింత చురుగ్గా స్పందించాలన్నారు. బంగారు కుటుంబం పథకం లక్ష్యాలను చేరుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ, వాటితో ఎరువు తయారీపై ఆరా తీశారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వేలో మంచి ఫలితాలు సాధించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలపై ఆరా తీసిన కలెక్టర్, సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, పలు శాఖల అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎపిపిఎస్‌సి పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - నరసన్నపేట

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నిర్వహిస్తున్న లెక్చరర్ పోస్టుల రాత పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మూడు నోటిఫికేషన్ల ద్వారా పలు లెక్చరర్ పోస్టుల భర్తీకి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్ పరీక్షా కేంద్రంలో ఉదయం 8 గంటలకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష ప్రారంభమైంది. పరీక్షా కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎ.కృష్ణవేణి, సెక్షన్ అధికారి ఎం.అమ్మాజీ పరిశీలించారు.

కేంద్రంలో ఏర్పాటు చేసిన సాంకేతిక సదుపాయాలు, సిసి కెమెరా పర్యవేక్షణ, అభ్యర్థుల బయోమెట్రిక్ ధ్రువీకరణ వంటి అంశాలను పరిశీలించారు. మంగళవారం నిర్వహించిన పరీక్షకు మొత్తం 148 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 95 మంది హాజరయ్యారు. 53 మంది గైర్హాజరయ్యారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా పకడ్బందీ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనున్నాయని చెప్పారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు తదితరులు

డిసెంబరులో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం, పలాస

డిసెంబరు నెలాఖరు నాటికి రాష్ట్రంలో 70 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా ఇచ్ఛాపురం, పలాసలోని రామకృష్ణాపురంలో టిడ్కో గృహ సముదాయాలను ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీషతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఇచ్ఛాపురం మున్సిపల్ కార్యాలయంలో టిడ్కో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిర్మాణాలు నిలిచిపోయాయని విమర్శించారు. డిడిలు తీసి ప్లాట్లు కేటాయించని లబ్ధిదారులకు సంబంధించిన బ్యాంకు ఇఎంఐలను కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలనే పట్టుదలతో ఉందన్నారు. అందులో భాగంగానే తాను టిడ్కో ఇళ్ల పరిశీలనను శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రారంభించానని చెప్పారు. టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద రేషన్ డిపో, బస్సు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని హోం మంత్రి అనితను కోరామన్నారు. టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేయాలని టిడిపి ఇచ్ఛాపురం మండల ప్రధాన కార్యదర్శి నందిగాం కోటేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడ్కో ఎస్ఇ మూర్తి, ఇఇ రామిరెడ్డి, వి.హరి, ఇచ్ఛాపురం మున్సిపల్ కమిషనర్ రమేష్, జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ చైర్మన్ వజ్జ బాబూరావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి, జనసేన నాయకులు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : టిడ్కో చైర్మన్‌కు సమస్యలను వివరిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు



శ్రీకాకుళం సిటీ : యువతలో నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ అన్నారు. యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖకు చెందిన మేరా యువ భారత్ ఆధ్వర్యాన శ్రీకాకుళం స్కిల్స్ హబ్ హాల్లో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవానిర్న మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఉత్తమ మానవ వనరులుగా అభివృద్ధి చెందే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. దేశ ప్రగతిలో యువత పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు చదువుతున్న కోర్సుతో పాటు నైపుణ్యాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శ్రీకాకుళం డిఎల్‌టిసి ఐటిఐ అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహనరావు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ఈ దినోత్సవం ద్వారా యువతకు నైపుణ్యాలు అందించడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, యువతను శక్తివంతం చేయడం, భవిష్యత్‌కు మెరుగైన దారి చూపడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్, సెట్‌శ్రీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.వి అప్పలనాయుడు, సీనియర్ వృత్తి నిపుణులు సిహెచ్.సుబ్బిరెడ్డి యువతతో నేరుగా సంభాషిస్తూ, నైపుణ్యాల ప్రాముఖ్యత, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి అవకాశాల గురించి వివరించారు.

రేపట్నుంచి పాలిటెక్నిక్ తుదివిడత కౌన్సెలింగ్

శ్రీకాకుళం సిటీ : ఈనెల 17వ తేదీ నుంచి తుది విడత పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ నిర్వహణకు సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రవేశాల జిల్లా ఇన్‌ఛార్జి కె.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సహాయ కేంద్రంలో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి కౌన్సెలింగ్‌కు హాజరు కాని పాలిసెట్ ర్యాంకర్లు ఈ కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 17 నుంచి 19వ తేదీ మధ్య ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, 18 నుంచి 20 మధ్య ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 18 నుంచి 20 మధ్య ఆప్షన్ల నమోదు ప్రక్రియలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 21న సీట్ల కేటాయింపు ఉంటుందని, సీట్లు లభించిన విద్యార్థులు ఈనెల 24 నుంచి 26వ తేదీ మధ్య కళాశాలల్లో చేరాల్సి ఉంటుందని తెలిపారు.

42 కేజీల గంజాయి స్వాధీనం

- నలుగురు నిందితుల అరెస్టు
- కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు

ప్రజాశక్తి - పలాస

పలాస రైల్వేస్టేషన్ సమీపంలో రెండు కేసుల్లో 42 కేజీల గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు తెలిపారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లాకు చెందిన ముగ్గురు మహిళలు పాట్నాలో ఒక అపార్ట్‌మెంట్‌లో వంటపని చేసేవారు. వీరితోపాటు అదేచోట పనిచేస్తున్న మరో మహిళతో కలిసి బగల్పూర్‌కు చెందిన వారితో గంజాయి కొనుగోలు చేసి రవాణా చేశారు. ఇందుకు రూ.ఐదు వేలు ఇస్తామని చెప్పడంతో రెండుసార్లు ఒడిశా నుంచి గంజాయిని తీసుకుని బగల్పూర్, పాట్నా వెళ్లినట్లు విచారణలో గుర్తించారు. ఈ క్రమంలో ఒడిశాలోని కందమాల్ జిల్లాకు చెందిన వారితో గంజాయి లావాదేవీలు చేసిన మరో ఇద్దరి సహాయంతో ఘనపూర్ రైల్వేస్టేషన్ వద్దకు ఐదు బ్యాగుల్లో 40 కేజీల గంజాయిని తీసుకొచ్చారు. దీన్ని బీహార్ నుంచి ఒడిశా ఘనపూర్ రైల్వేస్టేషన్ వద్దకు వచ్చిన వారికి అప్పగించారు. తిరిగి పలాస మీదుగా బగల్పూర్ వెళ్తుండగా పలాస రైల్వేస్టేషన్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. మరో నలుగురిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని డిఎస్‌పి తెలిపారు. మరో కేసులో హోటల్‌లో పనిచేస్తూ పరిచయమై ఒడిశా నుంచి గంజాయిని కేరళలో అప్పగిస్తే కేజీకి రూ.పది వేలు ఇస్తానని డీల్ కుదుర్చుకుని కేరళకు తరలిస్తుండగా పలాస రైల్వేస్టేషన్ వద్ద పట్టుడ్డారని తెలిపారు.

బస్సులు, ఆటోల్లో తిరుగుతూ, అవకాశం దొరికినప్పుడు ప్రయాణికుల బ్యాగుల్లో విలువైన వస్తువుల దొంగతనాలకు పాల్పడుతున్న అనకాపల్లికి చెందిన పరుపల్లి దుర్గను అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు తెలిపారు. ఆమె నుంచి రూ.6.5 లక్షల విలువైన ఆరు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పలాసకు చెందిన రోహిణి జూన్ నాలుగో తేదీన శ్రీకాకుళం నుంచి పలాస వస్తుండగా, తన బ్యాగు చోరీకి గురైందని కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బ్యాగులో ఆరు తులాల రెండు బంగారు హారాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈక్రమంలో నిందితురాలిని సోమవారం అరెస్టు చేశారు. ఆమెపై శ్రీకాకుళం టూటౌన్, గాజువాక, అనకాపల్లి, అనకాపల్లి రైల్వే పోలీస్‌స్టేషన్, నర్సీపట్నం, చోడవరం, నెలిమర్ల, మరికొన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదై ఉన్నాయన్నారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. కేసును ఛేదించిన సిఐ పి.సూర్యనారాయణ. సిబ్బందిని ఎస్‌పి మహేశ్వర రెడ్డి అభినందించారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి వెంకట అప్పారావు


మాట్లాడుతున్న గోవిందరావు

వి.జి.కె మూర్తి ఆశయసాధనకు కృషి
సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- కొత్తూరు

సిఐటియు తొలితరం నాయకులు వి.జి.కె.మూర్తి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని భూతాలగూడలో మంగళవారం మూర్తి 73వ జయంతిని నిర్వహించారు. ముందుగా మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూర్తి కార్మిక, గిరిజన, ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన వ్యక్తిని కొనియాడారు. ప్రభుత్వ నిర్బంధాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజా ఉద్యమాలకు తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. గిరిజన సంఘ ఆధ్వర్యాన పోరాటాలు చేసి సంపాదించుకున్న గిరిజన హక్కులను ప్రస్తుత ప్రభుత్వాలు హరిస్తున్నాయని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కొండలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు జిల్లాలో జిటిడిఎ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. దీనివల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిటిడిఎ లేకపోవడం వల్ల గిరిజన భూములను గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నారని విమర్శించారు. గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక తీవ్రమైన దోపిడీకి గురవుతున్నారని, ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని పేర్కొన్నారు. గిరిజన హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు చేయడమే మూర్తికి మనమిచ్చే ఘన నివాళి అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మోహనరావు, సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు కోనారి మోహనరావు, మండల నాయకులు శర్మ ప్రసాద్, గిరిజన సంఘం నాయకులు అప్పన్న, కుటుంబ సభ్యులు ప్రవంతి, సుధాకర్, సూర్యకుమారి, సోమశేఖర్ పాల్గొన్నారు. అనంతరం 50 మంది గిరిజనులకు దుస్తులను పంపిణీ చేశారు.


అవగాహన కల్పిస్తున్న తిరుపతిరావు

వృత్తి నైపుణ్యాలతో ఉపాధి

ప్రజాశక్తి- పొందూరు

విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని కెజిబివి ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, ఒకేషనల్ కో-ఆర్డినేటర్ తిరుపతిరావులు అన్నారు. పొందూరు మండలంలోని లోలుగు కెజిబివిలో మంగళవారం వరల్డ్ యూత్ స్కిల్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయులు మనమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కార్గో ఎయిర్‌పోర్టును వ్యతిరేకిస్తున్నాం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో రైతుల గుండెకాయలాంటి పచ్చని ఉద్దానంలో చిచ్చు రాజేయాలని చూస్తే సహించేది లేదని, కార్గో ఎయిర్‌పోర్టును వ్యతిరేకిస్తున్నామని ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవనశాఖ, రెవెన్యూ శాఖల సమీక్షలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, జోగి అప్పారావు, ఇతర సభ్యులు తహశీల్దార్ సీతారామయ్యను నిలదీశారు. గతంలో ఆర్‌డి వేదికపై ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ రైతుల అనుమతి లేకుండా ఇంచి స్థలం కూడా తీసుకోబోమని స్పష్టం చేశారని గుర్తు చేశారు. ఇటీవల కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ఆర్‌డిఒ, రెవెన్యూ సిబ్బంది వజ్రపుకొత్తూరు, మందస, పలాస రెవెన్యూ పరిధిలోని భూముల్లో సర్వే చేపడుతున్నారని అన్నారు. దీంతో రైతులు నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే చేసే సమయంలో రైతులకు చెప్పకుండా ఎందుకు వస్తున్నారని తహశీల్దార్‌ను నిలదీశారు. ఇది కేవలం మట్టి నమూనాల కోసం సర్వే మాత్రమేనని, రైతుల అనుమతి లేకుండా భూములు తీసుకోమని తహశీల్దార్ బదులిచ్చారు. బెండిగేటు- సువ్వరేవు, అక్కుపల్లి-కాశీబుగ్గ రహదారి 10 రోజుల్లో నిర్మిస్తామని, ఆరు నెలల కిందట చెప్పిన ఎమ్మెల్యే శిరీష తట్టెడు మట్టి వేయలేక అసమర్థ పాలన చేస్తున్నారని ఉదయ్ కుమార్ సభ దృష్టికి తీసుకొచ్చారు. 108 వాహనం డయాలసిస్ రోగులకు కోసం కూడా వినియోగించాలని సభ్యులు కోరారు. గుండెపోటును నివారించే ఇంజక్షన్లను ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ అందుబాటులో ఉంచాలన్నారు. నానాటికీ కిడ్నీ రోగులు పెరుగుతున్నారని, డయాలసిస్ కోసం ఆటో, ఇతర వాహనాలను ఒక్కసారికి రూ.వెయ్యి వరకు చెల్లించి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అక్కుపల్లి సర్పంచ్ లండ లోలాక్షి, సైనూరు సర్పంచ్ ఎ.గోవిందరావు కరుణాకర్, మరడ భాస్కరరావు కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, వైస్ ఎంపిపి తమ్మినేని శ్రావణి, ఎంపిటిసి కె.ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

'గరిమెళ్ల' రచనలు పాఠ్యాంశాలుగా చేర్చాలి


విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ట్రస్టు సభ్యులు

పోలాకి: స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాకవి కీర్తిశేషులు గరిమెళ్ల సత్యనారాయణ రచనలు నేటితరానికి తెలిసే విధంగా పాఠ్యాంశాలుగా చేర్చాలని గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి బాడాన రాజు కోరారు. సత్యనారాయణ 132వ జయంతి సందర్భంగా మండలంలోని ప్రియాగ్రహారంలో ఆయన విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతి మరిచిపోయిన జాతిరత్నం సత్యనారాయణ అని అన్నారు. ఆయన జయంతి, వర్ధంతులు ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆరో తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో గరిమెళ్ల రచించిన మాకొద్దీ తెల్ల దొరతనం గేయం పాఠ్యాంశంగా చేర్చడం గర్వకారణం అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎస్.ధనుంజయరావు మాట్లాడుతూ గరిమెళ్ల పేరిట గల చారిత్రిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావు మాట్లాడుతూ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రగతి సాహితీ సమాఖ్య అధ్యక్షులు ఇలపండ గణపతిరావు పాడిన మాకొద్దీ తెల్ల దొరతనం అను గేయం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రగతి సాహితీ సమాఖ్య అధ్యక్షులు ఇలపండ గణపతిరావు, ఉపాధ్యాయులు శాంతిస్వరూప్, మల్లిబాబు, అసిరినాయుడు, గౌరీశంకర్, దుర్గారావు, రామారావు, మోహనరావు, నరసింహమూర్తి, సుజాత పాల్గొన్నారు.

సాగు క్షేత్రం సందర్శన

ప్రజాశక్తి- లావేరు

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. మండలంలోని నాగంపాలెంలో ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ ద్వారా జగ్గురోతు తవిటినాయుడు పొలంలో సాగవుతున్న వరిసాగు క్షేత్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల అవసరమైన వర్షాలు పడకపోవడంతో రైతన్నల్లో ఆందోళన కలిగిస్తుందన్నారు. రైతులు ముందస్తుగా మేలుకొని మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వేసవి దుక్కులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎరువు, విత్తనం ఒకేసారి వేసే యంత్రాన్ని ఉపయోగించి వరి సాగు చేయడం అన్ని విధాల లాభదాయకమని అన్నారు. కార్యక్రమంలో లావేరు మండల సమన్వయకర్తలు జగ్గురోతు గోపాల్, వైశ్యరాజుల వెంకన్న పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న తవిటినాయుడు


బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ రవి

మున్సిపల్ కమిషనర్‌గా రవి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ కమిషనర్‌గా తమ్మినేని రవి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన పూజారి బాలాజీ ప్రసాద్ జూన్ నెలలో ఉద్యోగ విరమణ పొందారు. దీంతో పురపాలక సంఘ ఇఇగా ఉన్న జాన్సన్ గత 15 రోజులుగా ఇన్‌ఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పురపాలక సంఘం సేవలు, కార్యకలాపాలు సవ్యంగా, సకాలంలో జరిగేలా ప్రణాళికలు రూపొందించుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. కార్యాలయ సిబ్బంది అందరి సహాయ సహకారాలతో పురపాలక సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ముందుగా సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

జీతాలందక అవస్థలు

రణస్థలం: జూన్ నెల జీతాలు అందక మరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని ఎపియుఎస్ మండల అధ్యక్షులు జి.చిన్నికృష్ణం నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. జూన్ నెల జీతాలు పాత సిబ్బందికి వేసే అవకాశం ఉన్నా... ఎంఇఒ జీతాల బిల్లు పెట్టలేదని ఆరోపించారు. అలాగే జూలై నెల జీతాలైనా అవుతాయన్న భరోసా కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి జీతాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.


లక్ష్మి, ఆదినారాయణ మృతదేహాలు

ట్రాక్టర్ బోల్తా : అక్కాతమ్ముడు మృతి

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని కామేశ్వరపేటలో మంగళవారం ట్రాక్టర్ బోల్తా పడి అక్కాతమ్ముడు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లుకలాంకు చెందిన చోడి లక్ష్మి (38), గొడ్డు ఆదినారాయణలు అక్కాతమ్ముళ్లు. ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. లక్ష్మికి అదే గ్రామానికి చిన్నారావులో వివాహమైంది. రోజూ పనుల్లో భాగంగా మంగళవారం కామేశ్వరపేటలో ఇటుకల లోడు కోసం ఖాళీ ట్రాక్టర్‌లో వెళ్తున్నారు. వీరితో పాటు మరో ముగ్గురు ట్రాక్టర్‌లో ఉన్నారు. కామేశ్వరపేట సమీపంలో ట్రాక్టర్ ముందు టైర్ ఫంచర్ కావడంతో డ్రైవర్ అదుపు చేయలేకపోవడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లక్ష్మి, ఆదినారాయణ ట్రాక్టర్ కింద ఉండిపోవడంతో ప్రమాద స్థలంలోనే మృత్యువాత పడ్డాడు. ట్రాక్టర్ బోల్తాను గమనించిన మరో ముగ్గురు వేరే వైపు దూకేయడంతో ప్రాణాలను కాపాడుకున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మి భర్త చిన్నారు, ఇద్దరు కుమార్తెలు, ఆదినారాయణకు భార్య గన్నెమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 50 లీటర్ల నాటు సారా, 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు సోంపేట ఎక్సైజ్ సిఐ జి.వి.రమణ తెలిపారు. సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కంచిలి మండలం భువనాపురం సమీపంలో దాడులు చేశారు. సుమిత్ర వద్ద నుంచి 10 లీటర్లు నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జన్నాఘాయిలో నల్ల హరిభందు నుంచి 8 మద్యం సీసాలు సాధీనం చేసుకొని అన్నారు. పలాస టాస్క్‌ఫోర్సు సిబ్బంది, సోంపేట ఎక్సైజ్ సర్కిల్‌లోని మందస మండలం పిడిమండసలో దాడులు నిర్వహించి కడ్డాల రాజారావు అనే వ్యక్తి నుంచి 40 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులను సోంపేట కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సోంపేట ఎక్సైజ్ సిఐ జి.వి.రమణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సిఐ మధుకుమార్, సిబ్బంది మార్కారావు, అరుణ్ ఉమాపతి పాల్గొన్నారు.

'కరిమజ్జి'కి మాతృవియోగం


లక్ష్మీనారాయణమ్మ (ఫైల్)

రణస్థలం: రణస్థలం మాజీ సర్పంచ్, రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ (సొసైటీ) మాజీ అధ్యక్షుడు కరిమజ్జి భాస్కరరావుకి మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి లక్ష్మీ నారాయణమ్మ (85) మంగళవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు. లక్ష్మీనారాయణమ్మ పార్థివదేహాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, అభిమానులు, అధికారులు సందర్శించి నివాళ్లర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

లావేరు పిఎసిఎస్ అధ్యక్షునిగా దామోదరరావు


దామోదరరావు

ప్రజాశక్తి- లావేరు

లావేరు పిఎసిఎస్ అధ్యక్షునిగా కొత్తకుంకాంకు చెందిన టిడిపి నాయకుడు కూనపల్లి దామోదరరావును ప్రభుత్వం నియమించింది. ముగ్గురు సభ్యుల కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అధ్యక్షునితో పాటు డైరెక్టర్లుగా బుడుమూరుకు చెందిన టిడిపి నాయకుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు పండి గోపాలరావు, ఇజ్జడాపాలెంకు చెందిన బిజెపి నాయకుడు పతివాడ అప్పలనాయుడులను డైరెక్టర్లగా నియమించారు. ఈ సందర్భంగా దాము మాట్లాడుతూ తనను అధ్యక్షునిగా నియమించిన ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు నిష్పక్షపాతంగా సేవలు అందిస్తానని అన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి డివిజనల్ కేంద్రంలో వ్యవసాయ శాఖ, విజిలెన్స్‌శాఖ సంయుక్తంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులను ఆకస్మికంగా మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా టెక్కలి వైశ్యరాజు వెంకటరాజు షాపును మంగళవారం పరిశీలించారు. స్టాక్ రెజిస్టర్స్, బిల్లు పుస్తకాలు, గొడౌన్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సదరు దుకాణంలో హోల్‌సేల్, రిటైల్ అమ్మకాల పత్రాలు సక్రమంగా నిర్వహించని కారణంగా రూ.లక్ష విలువైన ఎరువుల అమ్మకాల నిలుపుదల చేశారు. డీలర్లు అందరూ క్రయవిక్రయాల నిర్వహణ ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు బొడ్డేపల్లి విజయప్రసాద్, విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అడారి సంతోష్‌కుమార్, ఎఒ ఎన్.శ్రీనివాసరావు, జిల్లా వనరుల కేంద్రం నుంచి వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్.వెంకటరావు, వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సోంపేట: ఎరువుల నియంత్రణ చట్టం 1985, నిత్యావసర వస్తువుల చట్టం నిబంధనలకు లోబడి ఎరువుల సరఫరా లైసెన్స్ పొందిన వర్తకులు, రైతులకు ఎరువులు అందించాలని తహశీల్దార్ అప్పలస్వామి సూచించారు. ఈ మేరకు మండలంలోని ఎరువులు దుకాణాలను తనిఖీ చేశారు. ఈయన వెంట ఎఒ నరసింహమూర్తి, సోంపేట డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు టి.భవానీశంకరరావు ఉన్నారు.

కేసుల భారం తగ్గించేందుకు మధ్యవర్తిత్వం

ప్రజాశక్తి- పొందూరు

రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతున్న భారాన్ని, కోర్టుల్లో పేరుకుపోతున్న పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించడం కోసమే సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వం - దేశం కోసం కార్యక్రమం తీసుకొచ్చిందని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలు మేరకు మధ్యవర్తిత్వం - దేశం కోసం కార్యక్రమంపై మంగళవారం పొందూరులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కక్షిదారులకు కేసుల నుంచి విముక్తే కాకుండా ఆర్థిక ఉపశమనం కలుగుతుందన్నారు. సుప్రీం కోర్టు సూచనలు, నిబంధనలకు అనుగుణంగా శిక్షణ పొందిన ముగ్గురు సీనియర్ న్యాయవాదులు ప్రతి సోమ, శుక్రవారాలు కక్షిదారుల మధ్య కేసులో రాజీ కుదురుస్తారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. కోర్టు నుంచి ప్రారంభించిన ర్యాలీ పొందూరు పట్టణంలో నిర్వహించారు. ర్యాలీలో న్యాయవాదులు కె.అశోక్, వై.బ్రహ్మాజీ, పి.రామ్మోహన్, కె.మంజుల, రాము, కృష్ణారావు, సురేష్ పాల్గొన్నారు.

కొత్తూరు : మధ్యవర్తిత్వం, న్యాయ విజ్ఞాన సదస్సుపై స్థానిక కోర్టు ఆవరణలో జడ్జి కందికట్ల రాణి అవగాహన కల్పించారు దీనిని ప్రజలు వినియోగించుకోవాలన్నారు మధ్యవర్తిత్వాన్ని ఉపయోగించుకుంటే కాలం, సమయం, ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.అప్పారావు, జి.ఫాల్గుణరావు, గేదెల సూర్యారావు పాల్గొన్నారు.

టెక్కలి : కోర్టులో పెండింగ్‌లోని మధ్యవర్తిత్వంపై సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పినకన అజయ్ కుమార్, శిక్షణ నిర్వాహకులు దివ్వెల వివేకానంద, ఎస్.దివాకర్, ఎ.వైకుంఠరావు, డి.భుజంగరావు, టెక్కలి, నందిగాం ఎస్ఐలు కె.రాము, మహమ్మద్ ఆలీ, పారా లీగల్ వాలంటీర్లు కె.గోపాలకృష్ణ, జి.శివశంకర్ పాల్గొన్నారు.


పొందూరు : ర్యాలీలో పాల్గొన్న జడ్జి, న్యాయవాదులు

కోటబొమ్మాళి: మధ్యవర్తిత్వంపై న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదుల డి.నరసింహమూర్తి, పూజారి వాసుదేవరావు, పల్లి వాసుదేవరావు, యు.తిరుమలరావు, ముద్దాడ వెంకటరావు, కోర్టు సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి అని పిఎసిఎస్ అధ్యక్షులు చింతు సుధాకర్ అన్నారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పింఛను అందజేస్తున్నామని అన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు అంతమందికి తల్లికి వందనం అమలు చేశామన్నారు. రూరల్ మండలంలో రూ.30 కోట్లతో 329 సిమెంట్ రోడ్డులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. రూ.12 కోట్లలో పది తారు రోడ్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాదారపు వెంకటేష్, ఉంగటి వెంకటరమణ, పాలిశెట్టి మల్లిబాబు, మూకళ్ల శ్రీనివాసరావు, ఎస్.వి.రమణమాదిగ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

టెక్కలి : సమాజంలోని యువతని నిర్వీర్యం చేసే మాదకద్రవ్యాల వినియోగంపై యువత దూరంగా ఉండాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ కోరారు. డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహనా సదస్సుని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కళాశాల ఈగల్ క్లబ్ ఆధ్వర్యాన చేపట్టిన ఈ కార్యక్రమంలో క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.ఎస్.ఆచార్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్‌కుమార్, అధ్యాపకులు కోటేశ్వరరావు, రామారావు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు రమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రవీణ్ ఆపన్నహస్తం

కవిటి: మండలంలోని భైరిపురానికి చెందిన నర్తు బాలకృష్ణ కుటుంబానికి రైజ్ సంస్థల అధినేత డాక్టర్ ప్రవీణ్ పుల్లట రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. కొంతకాలంగా చిన్నచిన్న ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న బాలకృష్ణ ఇటీవల గుండెపోటుకు గురయ్యారు. వైద్యులు స్టంట్ అమర్చారు. ఇదే సమయంలో ఆయన తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. ఇక బాలకృష్ణ భార్య కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న ప్రవీణ్ వెంటనే స్పందించారు. గ్రామస్తులు పిరియా ఆనందరావు, పుల్లట జగదీశ్వరరావు, పుల్లట రామారావు, నర్తు దేవేంద్ర, పిరియా సంతోష్‌ల ద్వారా ఆ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. బాలకృష్ణ కుమారుడు సాయికృష్ణకు ఉద్యోగం కల్పించే బాధ్యతను తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు.


ఆర్థికసాయం అందిస్తున్న గ్రామస్తులు

సంస్మరణ సభ విజయవంతం

ప్రజాశక్తి- సోంపేట

థర్మల్ అమరవీరుల సంస్మరణ సభలో పాల్గొని విజయవంతం చేసినందుకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు, మానవ హక్కుల వేదిక సభ్యులు వి.ఎస్‌కృష్ణ, జగన్నాథం, ప్రజాకవి జయరాజ్ అన్ని సంఘాల ప్రతినిధులకు రైతులు స్థానికులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు మంగళవారం సోంపేటలో పిపిఎస్, మత్స్యకార ఐక్యవేదిక సభ్యులు విలేకరులతో మాట్లాడారు. అమరల సంస్మరణ సభ విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కె.నారాయణ, బార్ల సుందరరావు, వి.వెంకన్న, పండి దానయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణమూర్తి

భద్రత పాటిస్తే ప్రమాదాల నివారణ
ఎఒఎల్ జనరల్ మేనేజర్ కృష్ణయ్య


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న రాంబాబు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

పరిశ్రమలో పనిచేసే ప్రతిఒక్కరూ బాధ్యతతో భద్రతను పాటిస్తే ప్రమాదాల నివారించగలమని, అందుకు ప్రతి ఉద్యోగీ బాధ్యతతో భద్రతను పాటించాలని ఆంధ్ర ఆర్గానిక్స్ (ఎఒఎల్) జనరల్ మేనేజర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎం.రాంబాబు సూచనల మేరకు పైడిభీమవరంలోని ఇండస్ట్రియల్ పార్కులో ఉన్న ఫార్మాస్యూటికల్ కంపెనీ ఆంధ్రా ఆర్గానిక్స్ లిమిటెడ్ ఎమర్జెన్సీ రెస్క్యూ టీం సేఫ్టీ మాక్ డ్రిల్‌ను మంగళవారం కార్మికులకు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ముందుగా అమోనియా ట్యాంకర్‌ను దించుతున్నప్పుడు సాల్వెంట్ యార్డులో నిర్వహించిన మాక్ డ్రిల్‌లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ప్రశంసనీయమైన పనితీరును ప్రదర్శించింది. డ్రిల్ దృశ్యంలో, ప్యాకింగ్ ప్రాంతంలో వాల్వ్ విరిగిపోవడం వల్ల అకస్మాత్తుగా గ్యాస్ లీక్ సంభవించినప్పుడు ఇద్దరు ఉద్యోగులు అమ్మోని యాను దించుతున్నట్లు చూపిం చారు. ఫలితంగా, ఇద్దరు కార్మికులు అమ్మోనియా వాయు వును పీల్చుకుని స్పృహ కోల్పోయారు. తక్షణమే వ్యూహాత్మకంగా స్పందించి, పరిస్థితిని త్వరగా అదుపు చేసి, మరింత తీవ్రతరం కాకుండా నిరోధించింది. ఈ డ్రిల్ సమయంలో వారి చర్యలు మానవ నిర్మిత, ఊహించని అత్యవసర పరిస్థితులను నిర్వహించడానికి, తగ్గించడానికి అవసరమైన విధానాలను సమర్థవంతంగా ప్రదర్శించాయి.

హామీలను నెరవేర్చుతున్నాం

మెళియాపుట్టి: రాష్ట్ర ప్రగతి కూటమి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా టిడిపి అధ్యక్షులు కలమట వెంకటరమణ అన్నారు. మండలంలోని కొలిగాంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు భాగంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, పైల లచ్చుమయ్య, కామాక్షి, పండ విష్ణు, పండ ఆనందరావు, భాస్కరరావు, తేజారావు పాల్గొన్నారు.

పలాస : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాసలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్ని ప్రజలకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్తా పాల్గొన్నారు.

హుదూద్ బాధిత కుటుంబాలకు అండ

శ్రీకాకుళం రూరల్: హుదూద్ తుపాను బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని కుందువానిపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం హుదూద్ బాధిత కుటుంబాలను కలిసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం 96 ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపత్తుల సమయంలో నష్టపోయిన ప్రతి కుటుంబానికీ అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరాడు అప్పన్న, టిడిపి మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, తహశీల్దార్ గణపతిరావు పాల్గొన్నారు.


శ్రీకాకుళం : రూరల్: ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్


అభినందిస్తున్న టిడిపి నాయకులు

సురేష్‌కు అభినందనలు

లావేరు : లావేరు టిడిపి మండల అధ్యక్షునిగా ముప్పిడి సురేష్ ఇటీవల తొమ్మిదోసారి ఎన్నికయ్యారు. దీంతో మండలంలోని తాళ్లవలస, బెజ్జిపురం టిడిపి నాయకులు వడ్డిపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యాన నాయకులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. సురేష్ నాయకత్వంలో మండలంలోని టిడిపి బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇజ్జడ సన్యాసినాయుడు, పిన్నింటి గౌరీశంకర్, సూర్యనారాయణ, కల్లూరి సంతోష్, రత్నాల రమేష్, సూర్యనారాయణ, సాయి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ విస్తృత తనిఖీ

బూర్జ : మండలంలోని సింగన్నపాలెంలో ఎస్ఐ ప్రవళిక ఆధ్వర్యాన మంగళవారం దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో మద్యం, నిషేధిత గుట్కాలు, సిగరెట్లు వంటివి కలిగి ఉన్నా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. మైనర్లు వాహనాలు నడిపేత చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఎటువంటి పత్రాలు లేని పది వాహనాలను పట్టుకున్నారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'



ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న ఎఒ అజయ్‌కుమార్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రైతులు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఎఒ అజయ్‌కుమార్ అన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మశాకపురం, అరకభద్ర గ్రామాల్లో శాస్త్రీయ పద్ధతులు-నీటి సాధన సమస్యలపై సోమవారం అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతులపై రైతులకు ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించడమేగాక, సాగుకు అవసరమైన నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. డ్రమ్ సీడర్, సీడ్ డ్రిల్ యంత్రాల ద్వారా వరి విత్తనాలను సమర్థవంతంగా నాటే విధానం చూపించాలన్నారు. పంటల్లో కలుపు నివారణకు వీడిసైడ్ వినియోగంపై వివరించారు. ఈ పద్ధతులను రైతులకు శ్రమలేమి తగ్గిస్తూ అధిక దిగుబడి సాధించేందుకు దోహదపడతాయని తెలిపారు. అరకభద్ర గ్రామ రైతులు తమ సమస్యలను ఉంచుతూ, బహుదా నది నీటిని వాడుకొనేందుకు లిఫ్ట్ ఇరిగేషన్, పంప్ సెటప్ ఏర్పాటు చేయాలని కోరారు. మసకపురం, పరిసర గ్రామాల్లో సాగు విస్తీర్ణం పెరగడంతో భూగర్భ జలాల ఆధారిత సాగుపై ఆధారపడుతున్న రైతులు నీటి మట్టాలు పడిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. దీని పరిష్కారానికి మౌలిక సదుపాయాల కల్పన అవసరమని రైతులు విజ్ఞప్తి చేశారు. వెంకటేష్, దీక్షిత్ పాల్గొన్నారు.

కవిటి: వరి నారుమడిలో సూక్ష్మధాతువు నివారణకు ఫార్ములా-4 లీటరు నీటికి 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని ఎడిఎ భవానీశంకర్ రైతులకు సూచించారు. మండలంలోని మాణిక్యపురం, బల్లిపుట్టుగ గ్రామాల్లోని వివిధ నారుమడులను మంగళవారం సందర్శించిన వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఈ సాంకేతికతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఒ పిరియా శ్రీదేవి, సహాయ అధికారి బెందాలం శ్రీకళ్యాణ్, ఎంపిఎఒ శరణ్య, ఎంపిఇఒ లలిత, విహెచ్ఎ జగదీష్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : ప్రకృతి వ్యవసాయ విధానాల్లో అత్యంత ప్రాముఖ్యత గల నవధాన్యాల విధానం ఆశాజనకంగా ఉందని టెక్కలి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.జగన్మోహనరావు తెలిపారు. సంతబొమ్మాళి మండలం లక్ష్మీపురంలో మంగళవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ రాళ్లపేట అప్పారావు, వ్యవసాయ విస్తరణాధికారులు గొండు శ్రీధర్, మెండ పావని, వ్యవసాయ సహాయకులు దేవాది సాయిరాజు, బాలక సాయికిశోర్ పాల్గొన్నారు.

సోంపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎఒ నరసింహమూర్తి కోరారు. మండలంలోనిసుంకిడి పంచాయతీ కోరంజిభద్ర, భూషాభద్ర గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, హరీష్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో రైతులు కర్రి భాస్కరరావు, కుష్దేవ్ బెహరా పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

అశోక్ గజపతిరాజుకి శుభాకాంక్షలు

రణస్థలం రూరల్: గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజుకి ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరంలోని ఆయన బంగ్లాలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా మీ సుదీర్ఘ రాజకీయ జీవితంలో అపారమైన అనుభవంతో పలుమార్లు కీలక పదవులు చేపట్టారని అన్నారు. గవర్నర్ స్థానానికి వన్నె తేవాలని కోరుతూ ఆకాంక్షించారు. ఆయనతో పాటు కూటమి నాయకులు లంక శ్యామలరావు, పిసిని జగన్నాథంనాయుడు, ముప్పిడి సురేష్, లంక ప్రభాకరరావు, రౌతు శ్రీనివాసరావు, పిసిని హరికృష్ణ, వడ్డాది శ్రీనివాసరావు, లుకలాపు అప్పలనాయుడు, పిన్నింటి మధుబాబు, లంక అప్పలనాయుడు ఉన్నారు.



పత్రాలను అందజేస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

ముగిసిన బిఎల్ఒల శిక్షణ

ప్రజాశక్తి- పలాస

రెవెన్యూ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న 284 మంది బిఎల్ఒలకు వారం రోజుల పాటు నిర్వహించిన శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా బిఎల్ఒలకు ఆర్‌డిఒ జె.వెంకటేష్ తన కార్యాలయంలో శిక్షణా పత్రాలను అందజేశారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిక్షణలో రోజుకు 50 మంది చొప్పున పాల్గొన్నారు. వారికి సాంకేతిక మెరుగుపరుచుకోవడం, నైపుణ్యతతో కూడిన విధులు నిర్వహించడం వంటి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, ఎన్నికల డిటి గురుప్రసాద్, డిటి గిరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని 30 గ్రామ పంచాయతీలకు చెందిన రైతులకు ఖరీఫ్ సాగు కు అవసరమైన ఎరువులు సరఫరా చేస్తామని నారాయణపురం ఆనకట్ట చైర్మన్, టిడిపి జిల్లా కార్యవర్గ కార్యదర్శి సరవల ఢిల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని కొర్లకోటలో ఆయన రైతులకు మంగళవారం ఎరువులను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, కొంతమంది వ్యక్తులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని అన్నారు. ఖరీఫ్‌కు సకాలంలో ఎరువులు అందజేస్తామని రైతులూ ఒకేసారి తీసుకువెళ్లి నిల్వ చేయకుండా విడతల వారీగా తీసుకొని వెళ్లి వినియోగించుకోవాల్సిన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు అగ్రికల్చర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



ఎరువులను పంపిణీ చేస్తున్న ఢిల్లేశ్వరరావు



మాట్లాడుతున్న రెడ్డి శాంతి

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సిఎం చంద్రబాబు సూపర్ సిక్స్ వంటి అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలే నెరవేర్చలేదని వైసిపి క్రమశిక్షణ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని ముకుందాపురంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మాజీ సిఎం జగన్, కూటమి పాలన మధ్య వ్యత్యాసాలను ప్రజలకు వివరించారు. జగన్ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాణా ఈశ్వరమ్మ, వైసిపి మండల కన్వీనర్ పోలాకి పోలాకి జైమునిరావు, సర్పంచ్‌లు సవర భాస్కరరావు, మజ్జి రామచందర్, తాడేల రామరాజు, మాడుగుల మణి, రవి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. పిజి విద్యార్థులకు శాపంగా మారిన జిఒ 77ను వెంటనే రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లోని రూ.6,400 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి డిమాండ్ చేశారు. 2020, 21, 22, 23లో పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు కళాశాల యాజమాన్యాలు అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయి, జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ, సంతోష్‌కుమార్, జగదీష్ పాల్గొన్నారు.



బస్సులో వెళ్తున్న రోగులు

నేత్రాలపై అప్రమత్తం

రణస్థలం: నేత్రాలపై అప్రమత్తంగా ఉండాలని కళ్యాణి నేత్రాస్పత్రి పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి తెలిపారు. స్థానిక బ్రాహ్మణవీధిలో ఉన్న కళ్యాణి నేత్రాస్పత్రి ఆవరణలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 65 మంది రోగులు పాల్గొన్నారు. అందులో 15 మందిని శస్త్రచికిత్స కోసం శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రికి రిఫర్ చేశారు.

ట్యాబ్‌ల అందజేత

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా ఆధ్వర్యాన పనిచేస్తున్న ఆర్‌పిలకు ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అలాగే పబ్లిక్ హెల్త్ వర్కర్లకు పుష్ కారులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెప్మా ఆర్‌పిలు ట్యాబ్‌లు వినియోగించుకొని సాంకేతిక నైపుణ్యత పెంచుకోవాలన్నారు. పబ్లిక్ హెల్త్ వర్కులు మున్సిపాలిటీ అందిస్తున్న పరికరాలను సక్రమంగా వినియోగించుకొని సుందర పలాసగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ఎపిటిడిసి చైర్మన్ వజ్జ బాబూరావు, ఎఎంసి చైర్మన్ ముల్లా శ్రీనివాసరావు, నాయకులు టి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, నాగరాజు, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, నవీన్, కమిషనర్ ఎన్.రామారావు, సిటీ మిషన్ మేనేజర్ మోహన్‌లు తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలి

నందిగాం: దళిత, ఆదివాసీలకు ఉద్యోగోన్నతుల రిజర్వేషన్లలో సక్రమంగా అమలు చేయాలని ఎపి దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బి.నారాయణరావు కోరారు. ఈ మేరకు ఎపి ఎస్‌టి కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావును మంగళవారం వినతిపత్రం అందించారు. పోలీసు ఉద్యోగాల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యాయం చేస్తూ... బిసి ఉద్యోగులకు అక్రమంగా ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

టెక్కలి పంచాయతీ ఇఒగా శ్రీనివాస్

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ మేజరు పంచాయతీ ఇఒగా ఎం.వి.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన జలుమూరు మండలం నగిరికటకం పంచాయతీ ఇఒగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇఒగా పనిచేసిన వెంకటరావు రాజాం మండలం ఇఒగా బదిలీపై వెళ్లారు. శ్రీనివాస్‌కు సిబ్బంది పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది



ఇన్వర్టర్లను అందజేస్తున్న కృష్ణారావు

ఇన్వర్టర్లు అందజేత

వజ్రపుకొత్తూరు: పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు కోరారు. తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న హనుమంతు కృష్ణారావు రూ.50 వేలు విలువ చేసే రెండు ఇన్వర్టర్లు పాఠశాలకు సోమవారం వితరణ చేశారు. ఆయన ప్రస్తుతం ఇదే పాఠశాలలో పనిచేస్తూ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న చందనరావు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన పిఆర్‌సి కమిషన్‌పై ఒక నిర్ణయం తీసుకోవాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంతబొమ్మాళి మండల కేంద్రంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 11వ వేతన సవరణ సంబంధించిన బకాయిలు చెల్లించాలన్నారు. పెండింగ్ డిఎలప్ర ప్రకటించి,ఎ రియర్స్ చెల్లించాలన్నారు. సరెండర్ లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కొయ్యా కోదండ రామిరెడ్డి, ఉపాధ్యాయులు ధూపాన తవిటిరెడ్డి, పి.జోగారావు, లబ్బ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.